క్లుప్తంగా

నేడు అభిషేక పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ శ్రీవెంకటేశ్వర గోశాలలో మంగళవారం ఉదయం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించనున్నారు. పంచామృతం, పండ్ల రసాలతో అభిషేక పూజలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల శ్రీనివాస చార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అవగాహన సదస్సు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఆర్‌జేసీ డిగ్రీ కళాశాలలో బీకాం విద్యార్థులకు సోమవారం ఐసీఎస్ఐ (ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యాన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్ అడ్వైజర్ ప్రదీప్ మాట్లాడుతూ కామర్స్ విద్య అభ్యసించిన వారికి సమాజంలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.లింగయ్య, ఇన్‌చార్జ్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగరాజుకు అభినందన

తిరుమలాయపాలెం: ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ సాధించిన మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన తిమ్మిడి నాగరాజును టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు సోమవారం అభినందించారు. వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టి డాక్టరేట్ సాధించడం హర్షణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసు, మోహన్, ఉన్నం రాజశేఖర్, వెంకటరమణ, రవీందర్, తిమ్మిడి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ హెచ్‌ఎంగా విక్రమ్‌రెడ్డి



కూసుమంచి: జిల్లా స్థాయిలో ఉత్తమ హెచ్‌ఎంగా కూసుమంచి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రేల విక్రమ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆయన్ను ఎంఈఓ రామాచారితో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

తుమ్మలను కలిసిన పలు పార్టీల నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీల నాయకులు సోమవారం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. గండుగులపల్లిలో తుమ్మల నివాసంలో మండలంలోని బోదులబండకు చెందిన పలువురు కలిసి కాంగ్రెస్‌లోకి రావాలని కోరారు. ఆయన్ను కలిసిన వారిలో కె.నాగార్జున, యం.నాగేశ్వరరావు, ఖాజామియా ఉన్నారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని కేజీబీవీలో కందాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కందాల సతీమణి విజయమ్మ, కుమార్తె దీప్తి విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంగీలాల్, సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు, దేవేందర్‌రెడ్డి, వీరన్న, కొప్పుల శ్రీనివాసరావు, మల్సూర్, వీరబాబు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 నమూనా ప్రదర్శన

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో ఉన్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం విద్యార్థినులు చంద్రయాన్-3 నమూనా ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినుల సమన్వయంతో రూపొందిన అందిన చందమామ పుస్తకాన్ని కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు ఆవిష్కరించి మాట్లాడారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా కోశాధికారిగా వెంకటేశ్వర్లు

తిరుమలాయపాలెం: తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కోశాధికారిగా మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన ఓర వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, బైరి శంకర్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు రాజు, జిల్లా అధ్యక్షులు కొప్పెర జానకీరాములు, నార్ల శ్రీనివాస్ తదితరులు నియామక పత్రాన్ని అందజేశారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి

నేలకొండపల్లి: గ్రామాల్లో ప్రజలకు వైరల్ జ్వరాలు సోకి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి రాకేశ్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఝాన్సీ మాట్లాడారు.. ఆవుల మంగతాయి, బచ్చలకూరి శ్రీనివాసరావు, రాయబారపు మధు, గాదె నరసింహారావు, కె.అరుణ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఖుషి
వినోద	జైలర్
సాయిరాం	బెదురులంక 2012
ఆదిత్య	ఓఎంజీ-2 (హిందీ)
శ్రీనివాస	భోళా శంకర్

- ఖమ్మంవ్యవసాయం

పుట్టకోటకు హ్యాపీ జర్నీ..

- ఏళ్ల తర్వాత ఆ గ్రామానికి రెండు లేన్ల రోడ్డు
- ఆపై డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ కూడా..
- రూ.7 కోట్ల 'సుడా' నిధులతో పనులు ప్రారంభం



మొదలైన డబుల్ లేన్ రోడ్డు నిర్మాణ పనులు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉన్నా అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో ఉన్న పుట్టకోట వాసుల కల ఏళ్ల తర్వాత నెరవేరుతోంది. ఈ ప్రాంతానికి రెండు లేన్ల రోడ్డు ని ర్మాణ పనులు జరుగుతుండగా, ఆపై డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి రానుంది. ఖమ్మం నుంచి రుద్రమకోట, పుట్టకోట ద్వారా అల్లీపురం, చింతకాని మండలానికి లింక్‌రోడ్డుగా ఉన్న పుట్టకోట రోడ్డు అభివృద్ధికి నోచుకోక సింగిల్ రోడ్డుగానే కొనసాగుతోంది. అంతేకాక ఈ రోడ్డు గుంతలమయమై ప్రయాణం పెద్ద ప్రయాసగా ఉండేది. రుద్రమకోట, పుట్టకోట గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు, ఆ తర్వాత ఖమ్మం మున్సిపాలిటీలో విలీనమయ్యాక కూడా అభివృద్ధికి నోచుకోలేదు. గత కార్పొరేషన్ ఎన్నికల సమయాన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణానికి 'సుడా' నుంచి రూ.7 కోట్లు మంజూరు చేయించారు. దీంతో పనులు చకచకా సాగుతుండగా, ఎన్నో ఏళ్ల కల అయిన డబుల్ లేన్ రోడ్డు వస్తుండడంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

మూడున్నర కి.మీ. మేర రోడ్డు

రెండు లేన్ల రోడ్డు నిర్మాణ పనులు వారం రోజులుగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఇరువైపులా చెట్లను తొలగించి రహదారి నిర్మాణానికి అనువుగా చదును చేసే పనులు చకచకా సాగుతున్నాయి. ఈ పనులను సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, వైస్ చైర్మన్ ఆదర్శ్ సురభి పరిశీలించి నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఖమ్మం – వైరా ప్రధాన రోడ్డు ఎస్ఆర్ గార్డెన్ జంక్షన్ నుంచి పుట్టకోట వరకు సుమారు మూడున్నర కిలోమీటర్ల రహదారి నిర్మించనున్నారు. తమ గ్రామాలు ఏర్పాటై పదేళ్ల తర్వాత డబుల్‌రోడ్డు, సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి రానుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, రహదారి నిర్మాణంతో తమ నివాస స్థలాలు, భూములకు పట్టణ ప్రాంతంలో మాదిరి ధరలు పలుకుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది



మా గ్రామం నగరంలోనే ఉన్నా మారుమూల ప్రాంతంలో మాదిరి రహదారి ఉండేది. ఇప్పుడు డబుల్ లేన్ రోడ్డు, డివైడర్‌తోపాటు సెంట్రల్ లైటింగ్ నిర్మించనుండటంతో ఎన్నో సంవత్సరాల మా కల నెరవేరబోతోంది. చాలా ఆనందంగా ఉంది. రాత్రి సమయంలో రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయి.

–బీరెడ్డి శేఖర్‌రెడ్డి, పుట్టకోట

ప్రయాణం ప్రయాసగా ఉండేది..



కేఎంసీ 15వ డివిజన్‌లో మా ప్రాంతం ఉన్నా అభివృద్ధి జరగలేదు. ప్రధాన రహదారి గుంతలమయమై, కంపచెట్లు పెరిగి పగలే ప్రయాణం పెద్ద కష్టంగా ఉండేది. ఇక రాత్రి సమయంలో ఎవరూ వచ్చేందుకు సాహసం చేసేవారు కాదు. ఆటోలు రావాలంటే డబుల్ కిరాయి అడుగుతుంటారు. ఇప్పుడు రోడ్డు పూర్తయితే ఆ ఇక్కట్లన్నీ తీరినట్లే.

–పుల్లూరి శ్రీకాంత్, పుట్టకోట

మంత్రి హామీని నెరవేర్చారు..



కేఎంసీ ఎన్నికల సమయాన మంత్రి పువ్వాడ అజయ్ ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయించారు. దీంతో రుద్రమకోట, పుట్టకోట, గుట్టపై కాలనీతోపాటు అల్లీపురం, చింతకాని మండలం కొదుమూరుకు మంచి రహదారి ఏర్పడుతుంది. మంత్రికి రుణపడి ఉంటాం.

–రావూరి కరుణసైదబాబు, 15వ డివిజన్ కార్పొరేటర్

ఎమర్జెన్సీ సేవలు కరువు

- కొందరు వైద్యులు విధులకు గైర్హాజరు
- ఇంకొందరు మధ్యాహ్నం తర్వాత ఇంటికే..

తిరుమలాయపాలెం: సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎమర్జెన్సీ సేవలను అందించాల్సిన వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. ఆస్పత్రిలో 16 మంది డాక్టర్లను నియమించాల్సి ఉంది. కానీ, దంత వైద్యుడితో కలిపి కలిపి ఐదుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రామారావు రెండు రోజుల నుంచి విధులకు హాజరు కాకపోగా సోమవారం ఉదయం నలుగురు డాక్టర్లు విధులకు హాజరయ్యారు. వారిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు వైద్యులు కృష్ణచైతన్య మాత్రమే అందుబాటులో ఉన్నారు. మండలంలోని తెట్టెలపాడు గ్రామానికి చెందిన బింగి మల్సూర్ పాముకాటుకు గురికావడంతో ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షించిన వైద్యులు ఎమర్జెన్సీ వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో లేవని ఖమ్మం వెళ్లాలని చెప్పారు. ఆస్పత్రిలో అంబులెన్స్ కూడా లేకపోవడంతో గంటపాటు ఎదురు చూడాల్సి వచ్చింది.



పాము కాటుకు గురైన వ్యక్తిని అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

జల్లేపల్లి గ్రామానికి చెందిన బత్తిని దాసు చాతినొప్పితో రావడంతో అతడిని కూడా ఖమ్మం వెళ్లాలని సూచించారు. ఆస్పత్రిలో ఫార్మసిస్టు, ల్యాబ్ అసిస్టెంట్ కూడా అందుబాటులో లేరు. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ కొందరికి వరంలా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఉదయం రాగానే అటెండెన్స్ వేసుకుని మధ్యాహ్నం తర్వాత ఇంటిదారి పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని పల్లె దవాఖానాల పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఈ విషయంపై డాక్టర్ రామారావుని వివరణ కోరగా డాక్టర్లు అందుబాటులోనే ఉన్నారని ఎమర్జెన్సీ సేవలలో ఇబ్బందులు ఉంటే ఖమ్మం పంపిస్తున్నామని తెలిపారు.

'దేశాన్ని తాకట్టు పెడుతున్న ప్రధాని'



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని, దేశాన్ని తాకట్టు పెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ హయాంలో దేశంలో రూ.100 లక్షల కోట్లు అప్పు చేసి ప్రైవేట్ వ్యక్తుల వ్యాపారాలకి సహకరించాడని, మోదీ విధానాలతో దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే సంక్షేమ పథకాలను ప్రకటిస్తోందని, అర్హులైన వారికి పథకాలు అందడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎర్రా శ్రీకాంత్, శ్రీనివాసరావు, రమ్య, బి.సుదర్శన్, వి.శ్రీనివాసరావు, కార్పొరేటర్ యర్రా గోపి, యాకయ్య పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో పోషకాహార వారోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా నగరంలోని గాంధీనగర్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం అందేలా తీసుకోవాల్సిన పదార్థాలపై వివరించారు. ఐసీడీఎస్ ఖమ్మం అర్బన్ సీడీపీఓ కవిత, సూపర్‌వైజర్ సత్యవతి, టీచర్లు ఆర్.వెంకటరమణ, ఎస్‌కే నూర్జాహన్, వి.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు

ఆదర్శ రైతులను నియమించాలి

నేలకొండపల్లి: రైతులకు – ప్రభుత్వానికి వారధిగా పనిచేసిన ఆదర్శ రైతులను తిరిగి నియమించాలని ఆదర్శ రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందగట్ల సైదులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడారు.. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రైతుల సంక్షేమం కోసం ఆదర్శ రైతుల వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. కానీ, సీఎం కేసీఆర్ తమను తొలగించారన్నారు. వెంటనే ఆదర్శ రైతుల వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో దేవరశెట్టి వెంకటేశ్వర్లు, గుడిబోయిన వెంకటేశ్వర్లు, మక్తాల రామకృష్ణ, తేజావత్ శివాజీ, పెద్దపాక ముత్తయ్య, కిలారు వెంకటేశ్వర్లు, జి.కోటేశ్వరరావు, చాగంటి శ్రీకాంత్, గాదె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం నగర పరిధి టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మా కంపెనీలో టెక్నికల్, ట్రైనీ ఉద్యోగాలు 50 ఖాళీగా ఉన్నాయని, వాటికి ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సుల్లో 55 శాతం మార్కులు పొంది ఉండాలని పేర్కొన్నారు. 2022 – 23 ఏడాదిలో ఉత్తీర్ణులై 17 నుంచి 20 ఏళ్లలోపు వయస్సు కలిగినవారు అర్హులని, వేతనం రూ.11 వేలు ఇస్తారని, ధ్రువపత్రాలు, ఆధార్, పాన్‌కార్డు, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

రైతులకు రుణమాఫీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని టేకులపల్లి ది ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సహకార సంఘం ద్వారా రైతుల రుణాలకు సంబంధించి నిధులు విడుదలవుతున్నాయని చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 24 మంది రైతులకు రూ.16 లక్షల రుణమాఫీ నగదును సోమవారం అందజేసినట్లు పేర్కొన్నారు. ఎంపీ సాకేత్‌కుమార్, వైస్ చైర్మన్ తమ్మినేని విజయలక్ష్మితో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఖమ్మంసహకారనగర్: కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ సమగ్ర శిక్ష జేఏసీ బాధ్యులు మహబూబ్ పాషా, వీరస్వామి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌లో రిలే నిరాహార దీక్ష చేశారు. వారికి యూటీఎఫ్, ఇతర సంఘాలు మద్దతు ప్రకటించాయి. కార్యక్రమంలో మోతీలాల్, ఇస్మాయిల్, పుష్కర్‌కుమార్, రాంబాబు, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుంటుమల్లన్న ఆలయంలో వైద్యశిబిరం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ట్రంక్‌రోడ్‌లో ఉన్న శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. యశోద గ్రూప్స్ ఆఫ్ మలక్‌పేట, ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన (2డీ ఇకో) వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండు లక్ష్మీనారాయణ, చుండూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన వైద్యశిబిరంలో 150 మంది పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు సోహెబ్, ప్రత్యూష, శ్వేత, ఉమాదేవి పాల్గొన్నారు.

ఏటీఎంలో ఊడిపడిన స్లాబ్ పెచ్చులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ ఏటీఎంలో పెచ్చులు ఊడిపడటంతో వినియోగదారులకు తృటిలో ప్రమాదం తప్పింది. ఓ బ్యాంక్ ఏటీఎంలో కొందరు వినియోగదారులు డబ్బులు డ్రా చేస్తుండగా సోమవారం సాయంత్రం స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. దీంతో వారు భయంతో బయటకు పరుగులు తీశారు. ఏటీఎంలోని సీలింగ్ అసంపూర్తిగా వదిలేయడంతో పెచ్చులు ఊడిపడినట్లు తెలుస్తోంది.

ప్రజల ఆస్తుల విలువ పెరిగింది..

- నన్ను గెలిపించడం ద్వారానే అభివృద్ధి కొనసాగుతుంది..
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనుల ద్వారా ఖమ్మం నగరంలో ప్రజల ఆస్తుల విలువ గణనీయంగా పెరిగిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని 43వ డివిజన్‌లో ముక్క కిశోర్, రూప ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. విస్తరిస్తున్న నగరంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తద్వారా పదేళ్ల కిందట గజం రూ.3 వేలు ఉన్న స్థలం నేడు రూ.30 వేలకు పైగా పలుకుతోందని చెప్పారు. గతంలో రాజకీయాలు చేసేందుకు నాయకులు ట్రస్ట్‌ల పేరుతో నీటిని సరఫరా చేసేవారని, కానీ నేడు ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందుతోందని వివరించారు. ఖమ్మంలో 14 ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉండగా.. ఇప్పుడు 24 ట్యాంక్‌లు ఉన్నాయని, బల్లేపల్లి, కాల్వొడ్డు వైకుంఠధామాలను అన్ని వసతులతో ఆధునీకీకరించామని తెలిపారు. కాగా, నగరంలో శంకుస్థాపనలు చేసి కొనసాగుతున్న పనులు పూర్తి కావాలన్నా.. ఖమ్మం మరింత అభివృద్ధి జరగాలన్నా రాష్ట్రంలో బీఆర్ఎస్, ఇక్కడ తనను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పువ్వాడ చెప్పారు. సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్‌తో పాటు గుండాల కృష్ణ, గరికపాటి వెంకటేశ్వరరావు, పోట్ల శ్రీకాంత్, వల్లభనేని రామారావు, పారుపల్లి రాము, వంకాయలపాటి ప్రభాకర్, చింతల సురేందర్‌రావు, కాటేపల్లి నవీన్, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, 41వ డివిజన్‌లో రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి పువ్వాడ అజయ్ శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

'మేరా మిట్టీ.. మేరా దేశ్' షురూ

ఖమ్మంఅర్బన్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అమరవీరుల జ్ఞాపకార్థం పవిత్ర అమృత్ ఘాట్ నిర్మించనున్నారు. ఇందులో భాగంగా పవిత్ర స్థలాల నుంచి మట్టి సేకరించేందుకు 'మేరా మిట్టీ.. మేరా దేశ్' కార్యక్రమాన్ని సోమవారం ఖమ్మంలో ప్రారంభించారు. ఈ మేరకు 9వ డివిజన్ రోటరీనగర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గెల్లా సత్యనారాయణ ఆధ్వర్యాన శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించాక ఆలయ ఆవరణతో పాటు కాలనీలోని పలువురి ఇళ్ల నుంచి మట్టి సేకరించారు. బీజేపీ ఖమ్మం అర్బన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు రుద్రప్రదీప్, అల్లిక అంజయ్య, దేవకీ వాసుదేవరావు, దొడ్డా అరుణ, కొలిపాక శ్రీదేవి, నీలిమ, సుగుణ, రమేశ్, సురేశ్, కోటి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి సేకరణకు వెళ్తున్న బీజేపీ నాయకులు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



తిరుమలాయపాలెం: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి గ్రామంలో కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులకు సోమవారం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి శంకుస్థాపన చేసి, రూ.లక్ష విరాళం అందజేశారు. అనంతరం గ్రామంలో బిస్మిల్లా ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ని ప్రారంభించారు. కీర్యాతండాలో శ్రీఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గుగులోత్ సురేశ్, భూమిక వివాహ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. మేడిదపల్లిలో రావుల కేశ్వరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎర్రగడ్డలో ఇటీవల మృతిచెందిన పోలెపొంగు కాటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ మంగీలాల్, చావా వేణు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన లగ్గిశెట్టి వెంకటేశ్వర్లు ఇటీవల మృతిచెందగా సోమవారం ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పెరికిసింగారం గ్రామానికి చెందిన అడపాల వీరయ్య మృతిచెందగా అతడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. కాగా, పాలేరు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డిని ప్రకటించగా వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో పలువురు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు.

ముస్లింలకు ప్రాధాన్యమిస్తేనే మద్దతు..

ఖమ్మంమామిళ్లగూడెం: ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే మైనార్టీల మద్దతు ఉంటుందని తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్ జేఏసీ జిల్లా కన్వీనర్ అబ్దుల్ రెహమాన్ స్పష్టం చేశారు. సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా జేఏసీ ఇన్‌చార్జ్ ఎండీ జమీల్ అధ్యక్షతన నగర మజీద్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించడంతోనే తమకు చెందాల్సిన హక్కులు రాజకీయ ఎజెండాలోకి వస్తాయని తెలిపారు. డాక్టర్ ఖిజర్, ఎండీ అబ్దుల్ రషీద్, ఎంఏ నయీం, హమీద్‌పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్దుల్ రెహమాన్

రుణమాఫీ అందకపోవడంపై ఆరా..



వివరాలు తెలుసుకుంటున్న ఏడీఏ విజయచంద్ర

నేలకొండపల్లి: ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం అందని రైతుల వివరాలు సేకరిస్తున్నట్లు కూసుమంచి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎస్.విజయచంద్ర తెలిపారు. కలెక్టర్ కార్యాలయం నుంచి అందిన జాబితాలో ఉన్న రైతుల రిమార్కులను తెలుసుకునేందుకు బ్యాంక్‌లవారీగా వ్యవసాయ అధికారులు సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్రాంచ్‌లో రుణమాఫీ వర్తించని రైతుల జాబితాను పరిశీలించారు. అనంతరం రిమార్క్‌లను కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందించనున్నట్లు ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ అరుణ, ఏఈఓలు అవినాష్, అరవింద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ఖమ్మంరూరల్: నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని శ్రీచైతన్య కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం మండలంలోని పాన్నెకల్‌లోని కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జరిగిన ఇండక్షన్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడుతూ.. కళాశాలను డీమ్డ్ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు పూనుకున్నామని తెలిపారు. అనంతరం డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక, ప్రిన్సిపాల్ పి.కృష్ణమూర్తి, ఐబీఎం ప్రతినిధి బాలగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎం.శ్రీధర్, శ్రీవిద్య

డీడీలు కట్టిన అందరికీ గొర్రెలు పంపిణీ చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో డీడీలు కట్టిన వారందరికీ గొర్రెలను పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాసాని ఐలయ్య అన్నారు. సోమవారం నగరంలోని మంచికంటిభవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెల పంపిణీ పథకం ద్వారా యాదవులు, కురమలు అభివృద్ధి చెందడం లేదని, అప్పులపాలవుతున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో 11 వేల మంది యాదవులు, కురమలు డీడీలు కట్టి గొర్రెల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. చింతలచెర్వు కోటేశ్వరరావు, తుశాకుల లింగయ్య, అల్లిక వెంకటేశ్వరరావు, లిక్కి కృష్ణారావు, గంగరాజు, నరసయ్య, వెంకటేశ్వరరావు, పంబాద్రి, వెంకటరమణ, సీతారాములు పాల్గొన్నారు.